ప్రజాశక్తి

శనివారం 30 మార్చి 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

శాశ్వత ఉద్యోగులకే పోలింగ్ విధులు

- కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, అంగన్వాడీలకు నో ఛాన్స్
- జాబితాలు సిద్ధం చేస్తున్న జిల్లాల అధికారులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 13న జరగనున్న పోలింగ్ ఏర్పాట్లపై జిల్లా అధికారులు దృష్టి సారించారు. ప్రధానంగా సిబ్బంది ఎంపిక, శిక్షణ, విధుల కేటాయింపు, ఒక నియోజకవర్గంలో పనిచేస్తున్న వారికి మరొక నియోజకవర్గంలో విధులు నిర్వహించేలా ప్రణాళిక రూపకల్పన చేస్తున్నారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఆరుగురు ఉద్యోగులు ఉంటారు. ప్రిసైడింగ్ అధికారిగా ప్రభుత్వ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, లేదా స్కూల్ అసిస్టెంట్‌లను నియమిస్తారు. మిగతా సిబ్బంది ఎస్‌జిటి, ఇతర టీచర్లను ఎంపిక చేస్తారు. వీరితోపాటు ఒక సచివాలయం ఉద్యోగి కూడా ఉంటారు. సచివాలయం ఉద్యోగికి కేవలం ఓటర్లకు 'సిరా' మార్కును వేసే బాధ్యతను అప్పగిస్తారు. ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉన్నందున వివిధ శాఖల్లో పనిచేస్తున్న వివిధ హోదాల్లో ఉన్న ఉద్యోగుల కూడా పోలింగ్ బాధ్యతలను అప్పగించాలని అధికారులు నిర్ణయించారు.

పోలింగ్ కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది మొత్తం ప్రభుత్వ శాఖల్లో శాశ్వత ప్రాతిపదికన పనిచేసే వారుండాలని ఎన్నికల కమిషన్ సూచించింది. ప్రభుత్వం పరిధిలో పనిచేసే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఎన్నికల విధులకు దూరంగా ఉంచుతారు. అంగన్‌వాడీ వర్కర్లతోపాటు ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులనూ ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని నిర్ణయించారు. ఈ మేరకు ఉద్యోగుల జాబితాలను జిల్లా అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఆరుగురు ఉద్యోగులతో పాటు మొత్తంగా 20 శాతం మంది ఉద్యోగులను రిజర్వులో ఉంచాలని ఎన్నికల కమిషన్ సూచించింది. 2019 ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులు, అధ్యాపకులు సరిపోకపోవడం వల్ల ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులను వినియోగించాలని భావించినా ఆయా కళాశాల యాజమాన్యాలు, నిర్వాహకులకు రాజకీయ పార్టీలతో అనుబంధంగా ఉండటం వల్ల చివరిలో ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని అంగన్‌వాడీ వర్కర్లను వినియోగించారు. కానీ ఈసారి వీరికీ అవకాశం ఇవ్వరాదని నిర్ణయించారు.

గ్రామ, వార్డు సచివాలయాల్లో రాష్ట్రం మొత్తం మీద దాదాపు లక్షా 10 వేల మంది ఉద్యోగులు ఉన్నా వీరిలో కేవలం 30 శాతం మందినే పోలింగ్‌కు వినియోగించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 15 వేల మంది సచివాలయం ఉద్యోగులు ఉండగా ఐదు వేల మందికే ఎన్నికల విధులు కేటాయించే అవకాశం ఉంది. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఒక సచివాలయం ఉద్యోగిని నియమించాలనే నిబంధన వల్ల వీరిలో అందరికీ ఈ విధులు అప్పగించే అవకాశం లేదు. మిగతా సచివాలయం ఉద్యోగులకు ఇతర బాధ్యతలు అప్పగిస్తారని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఎన్నికల విధుల దూరంగా ఉండాలని కొంత మంది ఉద్యోగులు ఇప్పటికే వివిధ రూపాల్లో జిల్లా ఎన్నికల అధికార్లకు విజ్ఞాపనలు అందిస్తున్నారు. అంతేగాక వేర్వేరు కారణాల వల్ల అప్పటికప్పుడు కొంత మంది గైర్హాజరు అయితే ఇబ్బంది లేకుండా ఉండేందుకు 20 శాతం రిజర్వు ఉద్యోగులను అందుబాటులో ఉంచాలని నిర్ణయించామని అధికార వర్గాలు తెలిపాయి.

రొంపిచర్ల నుండి నరసరావుపేటకు కలపలోడుతో వెలుతున్న ట్రాక్టర్

చెట్టు చెప్పలేదు.. అడిగే అధికారి లేదు..

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నన్ను కొడుతున్నారని చెట్టు చెప్పలేదు.. బహిరంగంగానే రవాణా అవుతున్నా అధికారులు పట్టించుకోరు.. వెరసి కలప అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. నరసరావుపేట నియోజకవర్గంలో కొంతమంది కలప వ్యాపారులు ధనార్జన కోసం నిబంధనలు మీరుతున్నారు. వాల్టా చట్టంపై గొడ్డలి వేటు వేస్తూ రోడ్ల వెంట, ఎన్‌ఎస్‌పి కాల్వ కట్ట మీద ఉన్న చెట్లను నరికిస్తున్నారు. వాటిని ఇటుక బట్టీలకు, హోటళ్లు, టింబర్ డిపోలకు తరలిస్తున్నారు. రోడ్ల వెంట ఉండే పొలాల్లోని తమ పైరుపై చెట్టు నీడ పడుతోందని, పంట సరిగా పండడం లేదని రైతులు ఫిర్యాదు చేస్తే కేవలం కొమ్మల వరకు తొలగించుకోవాలని ఆర్ అండ్ బి అధికారులు అనుమతిస్తారు. అంతేగాని ఏకంగా చెట్లనే కొట్టేయడానికి వీల్లేదు. అలాంటిది వేప, నల్లతుమ్మ సహా అనేక రకాల భారీ చెట్లను అక్రమార్కులు కొట్టేయిస్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రత్యేకంగా చెట్లు పెంచేవారు లేకున్నా ఇంత పెద్ద మొత్తంలో కలప ఎలా రవాణా అవుతుందనే అంశంలో అధికారుల ఉదాశీనతే అక్రమార్కులకు కొమ్ముకాస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అవమానం భారంతో ఆత్మహత్య

ప్రజాశక్తి-కొల్లిపర

ఆత్మ అభిమానం దెబ్బతిని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రమైన కొలిపర్లలో శుక్రవారం జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. కొల్లిపరకు చెందిన అయోధ్య శివరామకృష్ణ (29) టైల్స్ పని చేస్తుంటాడు. గ్రామానికే చెందిన తన పరిచయస్తునికి రూ.20 వేలు అప్పును స్థానికుల వద్ద నుండి వడ్డీకి రెండేళ్ల క్రితం ఇప్పించాడు. అయితే అప్పు తీసుకున్నవారు చెల్లించకపోవడం, వడ్డీనీ ఇవ్వకపోవడంతో అప్పు ఇచ్చిన వారు అప్పిచ్చిన వ్యక్తులు శివరామకృష్ణను నిలదీశారు. ఈ విషయమై గురువారం రాత్రి గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన శివరామకృష్ణ శుక్రవారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పొద్దునే లేచిన తండ్రికి శివరామకృష్ణ ఉరికి వేళ్లాడుతుండం కనిపించి కన్నీరు మున్నీరుగా విలపించారు. ఘటనా స్థలిని పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా మృతునికి ఏడాది కిందటే వివాహమైంది. భార్య ప్రస్తుతం గర్భవతి.

బిజెపి చదరంగంలో పావులైన ఆ పార్టీలు

సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య

- వారందర్నీ ఓడించి తగిన గుణపాఠం చెప్పాలి
- 'ఇండియా' ఫోరం అభ్యర్థులను గెలిపించాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య
- ప్రజాసమస్యలపై సిపిఎం నిత్య పోరాటాలు
- జిల్లా కార్యదర్శి పాశం రామారావు
- భీమిరెడ్డి సాంబిరెడ్డి వర్ధంతి సభలో నివాళులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మతోన్మాద బిజెపి రాజకీయ చదరంగంలో టిడిపి, జనసేన, వైసిపిలు పావులని, ఈ పార్టీలన్నింటినీ ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య అన్నారు. రానున్న ఎన్నికల్లో 'ఇండియా' ఫోరం అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. మండలంలోని కాజ సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు భీమిరెడ్డి సాంబిరెడ్డి 6వ వర్ధంతి శుక్రవారం జరిగింది. తొలుత సాంబిరెడ్డి చిత్రపటానికి నాయకులు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎంపిటిసి ఈదా ప్రతాపరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో కృష్ణయ్య మాట్లాడుతూ సిపిఎం అభ్యున్నతికి, పేదల సమస్యల పరిష్కారానికి సాంబిరెడ్డి చేసిన కృషి ఎనలేనిదన్నారు. పలు పోరాటాల్లో సాంబిరెడ్డి పాల్గొన్న తీరును గుర్తు చేశారు. అనంతరం ప్రస్తుత రాజకీయాలపై మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఎన్నికల బాండ్ల రూపంలో కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడిందని, ఈ విషయాలు ప్రజలకు తెలియకుండా ప్రతిపక్ష నాయకులను నిరంకుశంగా అరెస్టు చేయిస్తోందని విమర్శించారు. దేశ వనరులు, సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందన్నారు. విభజన చట్టం హామీలన్నింటినీ విస్మరించిందని, రాష్ట్రానికి నిధులేమీ ఇవ్వకుండా అన్యాయం చేసిందని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణం,

▶ 2లో

గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఏసుక్రీస్తును సిలువ వేసే సన్నివేశాలను వీధుల్లో ప్రదర్శించారు.

తెనాలి పట్టణం చెంచుపేటలో..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్ని చేర్పించండి : యుటిఎఫ్

పేజీ 8

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శనివారం సాయంత్రం) : 6.25

సహరీ (ఆదివారం ఉదయం) : 4.47

ఆకట్టుకున్న సిలువ యాత్ర ప్రదర్శన

ప్రజాశక్తి-తాడేపల్లి

గుడ్ ఫ్రై డే సందర్భంగా తాడేపల్లిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ముగ్గురోడ్డు బాప్టిస్ట్ చర్చ్ సంఘ పెద్దలు పాస్టర్ రవి కుమార్ ఆధ్వర్యంలో సిలువ యాత్ర ప్రదర్శన నిర్వహించారు. యాత్ర ముగ్గురోడ్డు నుండి సలాం సెంటర్, రామాలయం సెంటర్, రన్నింగ్ రూమ్, ఆర్.ఎం.ఎస్.కాలనీ లంబాడిపేట మీదుగా ముగ్గురోడ్డు చేరింది. యేసుక్రీస్తు సిలువ శ్రమలు, సిలువ వేసిన సన్నివేశాలను ప్రత్యేక ర్యాలీగా నిర్వహించగా అవి ప్రజలను ఎంతగానో ఆకట్టు కున్నాయి. ప్రజలు స్వాగతం పలికి మజ్జిగ, నిమ్మరసం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తుదిమెల్ల వెంకటయ్య, కూచిపూడి శ్రీనివాసరావు, పుప్పాల నాగయ్య, నన్నూరి కొండయ్య, ఇరికి ఇస్సాకు, మాచర్ల దానయ్య పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో టిడిపి 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు, నియోజకవర్గ పరిశీలకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

కాల్‌మనీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కొల్లిపర

అయోధ్య శివరామకృష్ణ ఆత్మహత్యకు కారకులైన వారిని అరెస్టు చేయాలని ఏపీ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. మండల కేంద్రమైన కొల్లిపరకు చెందిన కాల్‌మనీ వ్యాపారస్తులు లింగాల రామకృష్ణ, కొల్లిపర శేషులు కలిసి రోడ్డుపై వస్తున్న అయోధ్య శివరామకృష్ణపై దాడి చేశారని, దీంతో అవమానానికి గురై అదే రాత్రివేళ భార్య గర్భవతి అని కూడా చూడకుండా ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కాల్ మనీ వ్యాపారం చేస్తూ ప్రజల రక్తాన్ని పిల్చడమే కాకుండా మధ్యవర్తిగా ఉన్న అయోధ్య శివరామకృష్ణపై దాడి చేసి అతని ఆత్మహత్యకు కారకులైన లింగాలరామకృష్ణ, కొల్లిపర శేషును వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. రామకృష్ణ, శేషు వద్ద మధ్యవర్తిగా ఉండి ఇద్దరు వ్యక్తులకు రూ.పదేసి వేల చొప్పున రూ.20 వేలను అయోధ్య శివరామక్రిష్ణ అప్పుగా ఇప్పించగా అప్పు తీసుకున్న వారు చెల్లించలేదనే కారణంగా శివరామకృష్ణపై దాడి చేశారని పేర్కొన్నారు. కాల్‌మనీ వ్యాపారులు రూ.20-25 అధిక వడ్డీలతో ప్రజల రక్తాన్ని పీల్చటం పరిపాటైందని, దీనిపై ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. శివరామకృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

గోశాలకు సందర్శన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : శ్రీమత్ జ్యోతిష్ పీఠాధీశ్వర్ జగద్గురు శంకరాచార్య శ్రీ శ్రీ శ్రీ స్వామి వాసుదేవానంద్ సరస్వతి జి మహారాజ్ తిరుమల వెళుతూ ఉండవల్లి కరకట్ట రోడ్డులో పాతూరి నాగభూషణం ఆహ్వానం మేరకు అతిథి గృహానికి వచ్చారు. శుక్రవారం ఉదయం విజయవాడ కనకదుర్గను దర్శించుకొని పెదవడ్లపూడిలో పాతూరి నాగభూషణం గోశాలను సందర్శించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి, ధర్మప్రచారక్, రవికృష్ణ, వేణు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బిజెపి చదరంగంలో పావులైన ఆ పార్టీలు

(మొదటి పేజీ తరువాయి)

కడప స్టీల్ ఫ్యాక్టరీ, దుగ్గరాజుపట్నం పోర్టు, కేంద్ర విద్యా సంస్థలు ఇవేవీ అమలు కాలేదన్నారు. బిజెపి పాలనలో పెట్రోల్, డీజిల్, ఇతర నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయని, కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలను మార్చారని మండిపడ్డారు. పంటకు మద్దతు ధర కల్పిస్తామనే హామీనీ తుంగలోతొక్కారని అన్నారు. ఢిల్లీలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సాగుతున్న రైతు ఉద్యమంపై దారుణ అణచివేతకు పాల్పడిందని విమర్శించారు. ప్రతిపక్షాలపై ఇడి, సిబిఐ, ఐటి తదితర కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. మత ఘర్షణలు రేపడంతోపాటు ముస్లిములు, దళితులు, క్రైస్తవులపై దాడులు చేస్తున్నారని, రాజ్యాంగ విలువలను మంటగలుపుతున్నారని, ఈ నేపథ్యంలో బిజెపిని ఓడించి దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఉద్ఘాటించారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ ఒకవైపు రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేసిన బిజెపితో కూటమి కట్టి మరోవైపు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వైపు నడిపిస్తామని టిడిపి, జనసేన చెబుతున్నారని, రాష్ట్రానికి బిజెపి ఇప్పటి వరకు ఏం మేలు చేసిందో చెప్పాలని నిలదీశారు. మద్యాన్ని నిషేధించాకే ఓట్లు అడుగుతామని గత ఎన్నికలప్పుడు చెప్పిన వైసిపి ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని ఓట్లడుగుతుందని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించాలని కోరిన ప్రతి ఒక్కర్నీ అణచివేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. మంగళగిరి నియోజకవర్గంలో సిపిఎం అనేక పోరాటం నిర్వహించిందని, రైతు, వ్యవసాయ కూలీలు, కార్మికుల సమస్యలపైన, ఇళ్ల పట్టాల కోసం చేనేత కార్మికుల సమస్యలపైన ఉద్యమించిందని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో 'ఇండియా' ఫోరం బలపిచ్చే సిపిఎం, వామపక్ష పార్టీల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ కేసులకు భయపడి మోడీకి చంద్రబాబు, జగన్ సలాం కొడుతున్నారని, రాష్ట్రానికి అన్యాయం చేసిన మోడీని ప్రశ్నించాల్సింది పోయి కాళ్లపై పడడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై సిపిఎం రాజీలేని పోరాటాలు చేసిందని, మంగళగిరి నియోజకవర్గంలో వేలాది మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇప్పించిందని అన్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలపై అవగాహన కలిగిన, ప్రజల కోసం పోరాడే సిపిఎం, వామపక్ష పార్టీలు, ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

సాంబిరెడ్డి చిత్రపటానికి పూలమాలలేసి నివాళు లర్పిస్తున్న పాశం రామారావు, జొన్న శివశంకరరావు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య మాట్లాడుతూ కాజా గ్రామంలో పొలాలకు నీటి వనరుగా ఉన్న సుందరయ్య సాగరాన్ని కలుషితం చేసిన పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ మాట్లాడుతూ చేనేతకు అన్యాయం చేసిన వారు చేనేత బిడ్డ అంటూ ప్రచారం చేసుకుంటున్నారని, చేనేత గుంత మగ్గాలను అపహాస్యం చేసిన వ్యక్తుల కుమారుడు చేనేత జపం చేస్తూ ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. చేనేతలకు వైసిపి, టిడిపి ఏం న్యాయం చేశాయని ప్రశ్నించారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ దేశ, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్న పార్టీలకు సాంబిరెడ్డి స్ఫూర్తితో గుణపాఠం చెప్పాలన్నారు. సాంబిరెడ్డి ఆశయాలను కొనసాగించాలని కోరారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు, తాడేపల్లి రూరల్ మండల కార్యదర్శి డి.వెంకట్‌రెడ్డి, మంగళగిరి రూరల్ మండలం నాయకులు యు.దుర్గారావు, బి.కోటేశ్వరి, ఎస్.ఆదిశేఖర్, ఎ.సాంబశివరావు పాల్గొన్నారు.

ఇసుక మాఫియా బరితెగింపు

ఇసుక అక్రమ తరలింపును అడ్డుకున్న వారిపై దాడులు
బైకులను ట్రాక్టర్లతో తొక్కించినన వైనం

ప్రజాశక్తి - తెనాలి

గుంటూరు జిల్లా కొల్లిపర మండలం మున్నంగి ఇసుక రీచ్‌లో ఇసుక మాఫియా బరితెగించింది. ఇసుక తవ్వకాలు ఆపేయాలని గ్రామస్థులు అడ్డుకోవటంతో ఆగ్రహించిన వైకాపా నేతలు గ్రామస్థులపై దాడిచేయడమే కాకుండా ద్విచక్ర వాహనాలను ట్రాక్టరుతో తొక్కించి ధ్వంసం చేశారని బాధిత కుటుంబాలు వాపోతున్నాయి. స్థానికుల వివరాల ప్రకారం.. మున్నంగి ఇసుక రీచ్‌లో ఇసుక అక్రమ తవ్వకాలు ఇదేచ్ఛగా కొనసాగుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటి, బోరుబావులు ఎండిపోతున్న కారణంగా ఇసుక తవ్వకాలను అడ్డుకోవాలని గ్రామస్థులు నిర్ణయించారు. గ్రామానికి చెందిన వైసిపి నేతలు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా శుక్రవారం రాత్రి గ్రామంలోని కొందరు ఆ ట్రాక్టర్లను అడ్డుకున్నారు. దీంతో ఇసుక మాఫియా ఆగ్రహించింది. అడ్డుగా వచ్చిన వారిపై దాడిచేశారు. వారి ద్విచక్ర వాహనాలను ట్రాక్టర్తో ఢీకొట్టి ధ్వంసం చేశారు. ఈ ఘటనలో గ్రామానికి చెందిన వి.బాలరాజు, వి.అశోక్, కె.మహేష్, వి.మహేష్, మోజెస్ తదితరులకు గాయపడినట్లు తెలిసింది. వారిని స్థానికులు తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. ఘటనకు బాధ్యులైన ఇరు వర్గాలను పోలీసులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఇసుక మాఫియాను అధికారులు అడ్డుకోకపోగా, అడ్డుకున్న స్థానికులపై వైసిపి నాయకులు దాడులకు పాల్పడటం ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఈ పరిణామాలు ఎటు దారితీస్తాయోనని బాధిత కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయి. ఇదిలా ఉండగా ఆసుపత్రిలో చేరిన వారు కూడా మీడియాతో మాట్లాడటానికి గాని, సమాచారం ఇవ్వడానికి కానీ భయపడుతున్నారు.

అడుగంటుతున్న చెరువులు.. బోర్లకు అందని జలాలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఈ ఏడాది రబీ సీజన్లో సాగునీటి కాలువలకు ప్రభుత్వం నీటిని నిలిపివేయడంతో తీవ్ర ఎండల ప్రభావం కారణంగా చెరువులు సైతం ఒట్టిపోతున్నాయి. ఇప్పటికే భట్టిప్రోలు మండలంలో అద్దేపల్లి సాలిచెరువు, వేమవరం, పల్లికోన, ఐలవరం వంటి గ్రామాల్లో ఉన్న చెరువులు రోజుకోరకంగా నీరు కిందకు దిగిపోయి అడుగంటుతున్నాయి. మార్చిలోనే చెరువులు ఈ విధంగా అడుగంటుతుంటే అటు పశువులకు, ఇటు ప్రజల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేస్తున్న బోర్లు ద్వారా వాటర్ షెడ్లు సైతం నీరు అందక ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. పంటలు పూర్తి కాగానే రైతులు తమ పశువులను మేపుకోవటానికి పొలాల్లోకి పెడుతూ ఉంటారు. ఈ క్రమంలో సమీపంలో ఉన్న చెరువులలో పశువులు దాహార్తిని తీర్చుకుంటూ ఉంటాయి. ఇలాంటి తరుణంలో కొన్ని ప్రాంతాల్లో చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. పొలాలకు వెళ్లే పశువులు తాగటానికి నీరు లేక రైతులు పూర్తిస్థాయిలో పశువులను పొలాల్లో మేపుకునే పరిస్థితులు లేవు. సుమారు ఏడు ఎకరాలకు పైగా ఉన్న ఐలవరం పైడమ్మ చెరువు సుమారు 15 అడుగుల లోతు నీరు ఉంటుంది. ఈ నీరు పూర్తిగా తగ్గిపోయి అడుగంటి నాలుగైదు అడుగులకు చేరింది. ఇప్పటికే చిన్న చిన్న చెరువులు పూర్తిగా ఎండిపోగా ఉన్న కీ చెరువు కూడా అడుగంటితే పశువులకు నీరు లేకపోవడమే కాక చేతిపంపులు కూడా నీటిని సరఫరా చేయలేకపోతున్నాయని ఆవేదన చేస్తున్నారు. సుమారు 35 డిగ్రీల నుండి 38 డిగ్రీల వరకు ప్రస్తుతం ఎండలు కాస్తుండగా సాగునీటి కాలువలు లేకపోవడంతో బోర్లు పనిచేయక భూగర్భ జరాలు అందకపోవటంతో ఆ గ్రామాల్లో రక్షితనీటి పథకం ద్వారా సరఫరా చేసే నీరు పూర్తిస్థాయిలో ప్రజలకు దాహార్తి తీర్చలేకపోతున్నాయని ఆ గ్రామాల ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. ఇప్పటికే రబీ సీజన్లో రైతులు సాగు చేసిన జొన్న, మొక్కజొన్న పంట కాలువలకు నీటి విడుదల లేకపోవడంతో పూర్తిగా ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయిన పరిస్థితి కూడా ఉంది. ఇప్పటికే అనేక గ్రామాల్లో నివాస గహాల వద్ద ఏర్పాటు చేసుకున్న చేతిపంపులు నీరు రాక ఒట్టిపోతున్నాయని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలలో ఏ విధంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సొమ్ము చేసుకుంటున్న పాటదారులు

సుమారు 7.70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మైలవరం పైడమ్మ చెరువులో మూడేళ్ల క్రితం చేపల వేలం పాటకు దేవాదాయ శాఖ అధికారులు కేటాయించారు. ఈ ఏడాదితో పాటదారుని కాలవ్యవధి పూర్తి కావస్తుండటంతో ముందుగానే తెలుసుకున్న పాతదారుడు నీటిని మొక్కజొన్న సాగు చేసిన రైతులకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఎకరాకు ఒకసారికి వెయ్యి రూపాయలు చొప్పున సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ చెరువులో నీటిని రైతులు వినియోగించుకుని పంటలను కాపాడుకోగా పాటదారునికి మాత్రం కాసుల పంట కురిసింది. పాటకాలం పూర్తి కావడంతో నీటిని బయటకు తోడి చేపలు పట్టుకొని చెరువును ఖాళీ చేసి దేవాదాయ శాఖ అధికారులకు అప్పగించాల్సి ఉంది. కానీ రైతులకు విక్రయించటం వల్ల నీటిని బయటకు తోడే పని లేకుండా రైతులే తోడుకోవటం వల్ల అదనంగా లక్ష రూపాయలు పాతదారునికి ఆదాయం కూడా లభించినట్లయ్యింది. దీని కారణంగా చెరువు పూర్తిగా ఒట్టిపోయి పశువులకు కూడా నీరు లేకుండా పోయిందని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు.

నేర్చుకున్నవి నేర్పుతూ.. తెలియనివి తెలుసుకుంటూ..

- కళాశాల నుండి నేరుగా రైతులతో మమేకం..
- పంటల సాగు విధానంపై వ్యవసాయ విద్యార్థుల అధ్యయనం
- క్షేత్ర స్థాయిలోకి వ్యవసాయ విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతులతో మమేకమై వ్యవసాయ సాగులో విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకుంటున్నామని, రైతులతో మమేకమై అనుభవపూర్వక వ్యవసాయ విధానంపై అధ్యయనం చేస్తున్నామని, కళాశాలలో నేర్చుకున్న వ్యవసాయ విద్యకు రైతు అనుభవాన్ని జోడించి లాభసాటి వ్యవసాయం, సమగ్ర వ్యవసాయ విధానం, పంటల సాగు సరళలో మార్పులు, భూసార పరిరక్షణ, విత్తనాల ఎంపిక సాగు విధానంపై బాపట్ల ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం విద్యార్థులు అంటున్నారు. వ్యవసాయ విద్యలో భాగంగా రైతులతో మమేకమయ్యారు. నాలుగేళ్ల వ్యవసాయ విద్యలో భాగంగా చివరి ఏడాది క్షేత్ర స్థాయిలో వ్యవసాయ పంటల సాగు విధానంపై ప్రత్యక్ష అధ్యయనం కొన సాగిస్తున్నారు. కొన్ని నెలల క్రితం మొదటి విడతలో 28 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రస్తుతం 2వ విడతలో పల్నాడు జిల్లా వ్యాప్తంగా 27 మంది విద్యార్థులు 5 బృందాలుగా ఏర్పడి రొంపి చర్ల మండలం విప్పర్ల, రెడ్డిపాలెం, నక రికల్లు మండలం దేచవరం, రూపెనగుంట గ్రామాల్లోనే ఉండి క్షేత్ర స్థాయిలో పంట పొలాలను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో రొంపిచర్ల మండలం విప్పర్ల, రెడ్డిపాలెం గ్రామాల్లోని వ్యవసాయ విద్యార్థుల బృందాన్ని 'ప్రజాశక్తి' పలుకరించింది. గ్రామంలో ఉంటూ వ్యవసాయ విద్యలో తాము నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో రైతులకు వివరించడంతో పాటు రైతులు నుండి మెలకువలు నేర్చుకుంటున్నారు. భూమిలో సేంద్రీయ కర్బనం సూక్ష్మ పోషకాల పెంపుదలకు చేపట్టాల్సిన చర్యలు రైతులకు వివరి స్తున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు.

అనుభవపూర్వక విధానంపై అధ్యయనం

గురువుగారి రమేష్, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త

చివరి ఏడాది వ్యవసాయ విశ్వ విద్యాలయం విద్యార్థులు గ్రామాల్లో పర్య టిస్తున్నారు. ఈ క్రమంలో పల్నాడు జిల్లా వ్యాప్తంగా 27 మంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామాల వారీగా విడిపోయి రైతులతో కలిసి వంటల సాగును పర్య వేక్షిస్తున్నారు. గ్రామాల్లో పంటలు సాగు చేస్తున్న రైతుల అనుభవాలు అడిగి తెలు సుకుంటున్నారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాతావరణ పరి స్థితులకు అనుగుణంగా సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సాగుకు అనువైన వనరులు, భూసారం, నీటి లభ్యత, పంటల మార్పిడి, గ్రామీణ నైసర్గిక స్వరూపం, భౌగోళిక పరిస్థితులు, పంటల సాగులో లాభ నష్టాలు, తక్కువ పెట్టుబడి అధిక లాభం తదితర అం శాలను విడమర్చి వివరిస్తున్నారు. కళాశాల విద్యార్థుల ద్వారా విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకొని గతానుభవాలను జోడించి లాభసాటి వ్యవసాయం వైపు అడుగులు వేస్తామని రైతులు అంటున్నారు.

రైతులకు వివరించి చెబుతున్న వ్యవసాయ విద్యార్థులు

సాగులో భూసార పరీక్షలు కీలకం

ఎ.వాగ్దేవి, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థిని

సాగు భూముల్లో పోషక లోపాలను గుర్తించడం కోసం భూసార పరీక్షలు తప్పనిసరి. ప్రతి 3 పంటలకు ఒకసారి భూసార పరీక్ష చేయించుకోవడం ద్వారా భూముల్లో గల పోషక విలువల లోపా లను గుర్తించవచ్చు. భూసార పరీక్షల విశ్లేషణ ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాల్సి ఉంటుంది. ఫలితంగా సాగు చేసిన పంటల నుండి నాణ్యమైన దిగుబడి సాధించడం, పెట్టుబడి వ్యయం తగ్గి నికర ఆదాయ పెరుగుతుంది. భూసా రాన్ని పరీక్షించుకోవడం ద్వారా భూమిలో నత్రజని, భాస్వరం, పొటాష్ పాటు సూక్ష్మ పోషకాల లభ్యత, సేంద్రీయ కర్బన శాతం మెరుగ్గా ఉండేలా చూసుకోవాలి.

గ్రామంలో రైతులను ఏకం చేసి మాట్లాడుతున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

పంటల మార్పిడితో మరిన్ని ఫలితాలు

బి.వేద శ్రీ విద్య.. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థిని

ఆనవాయితీగా ఎప్పుడు ఒకే రకమైన పంటలు కాకుండా పంట మార్పిడితో ఆశించిన ఫలితాన్ని పొందవచ్చు. నూతన వంగడాలు, స్థానిక వాతావరణ పరిస్థితులను అనుసరించి పంటలను సాగు చేయడం ద్వారా ఆశించిన దిగుబడి వస్తుంది. ప్రధానంగా నేల స్వభావం దృష్ట్యా అనువైన పంటలను సాగు చేసు కునే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. కళాశాలలో నేర్చుకున్న వ్యవసాయ విధానానికి రైతు అనుభవాన్ని జోడించి సాగు విధానంలో మెలకువలు తెలుసుకుంటున్నాం. విత్తన మొలక దగ్గర నుండి మొదలు పంట కాలం పూర్తి అయ్యే వరకు రైతుతో కలిసి పంటల సాగులో రైతులు అవలంబిస్తున్న విధానం తెలు కోవడం, రైతులతో మమేకం అవడం సంతోషంగా ఉంది.

సేంద్రియ పద్ధతులలో పంటల సాగు

ఎం.సాయి సౌమ్య, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థిని

ఆరోగ్యకరమైన ఆహారం అం దించడంలో భాగంగా రైతులు సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలు పండించడంపై అవగాహన కల్పిస్తున్నాం. పంటల సాగులో కూడా రసాయన ఎరువుల విని యోగం తగ్గిస్తూ సేంద్రియ పద్ధతుల్లో పం టలు సాగు చేయడం ద్వారా నేల సార వంతం కావడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారాన్ని సమాజానికి అందించినట్లవుతుంది.

సేంద్రీయ పద్ధతుల్లో పండించిన పంటలకు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉన్నందున అటువైపుగా పంటల సాగుపై దృష్టి పెట్టాలని రైతులకు సూచిస్తున్నాం.

క్షేత్ర స్థాయిలో రైతులతో మాట్లాడుతున్న కళాశాల విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో కార్పెంటర్ మృతి

ప్రజాశక్తి-దుగ్గిరాల

కార్పెంటర్ మేస్త్రి జాన్ వలి

తెనాలి-విజయవాడ రహదారిపై తెనాలి రూరల్ మండల గ్రామం కంచర్లపాలెం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుగ్గిరాల అలీ నగర్ కు చెందిన కార్పెంటర్ మేస్త్రి షేక్ జాన్ వలి (45) అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు ద్విచక్ర వాహనంపై ఉన్న కొలకలూరు గ్రామానికి చెందిన షేక్ కరీముకు తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించగా, మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దాదాపు ముప్పై ఏళ్ల క్రితం జాన్ వలి తండ్రి హబీబుల్లా (ఇతను కూడా కార్పెంటర్ మేస్త్రి) దుగ్గిరాల గ్రామ సమీపంలో జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదంలో మృతి చెందాడు. అతనికి ఐదుగురు సంతానం. ముగ్గురు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. జాన్‌వలి తల్లి ఫైజున్నిస తల్లితో పాటు తండ్రి పాత్ర కూడా పోషించింది. చిన్నప్పుడే భర్తను కోల్పోయిన ఆమె కుటుంబ బాధ్యతను మోసింది. ముగ్గురు మగ పిల్లలకు కార్పెంటర్ పని నేర్పించింది. ఇద్దరు ఆడపిల్లలకు వివాహము చేసింది. జనవరి కి భార్య ఒక ఆడపిల్ల ఒక మగ పిల్లవాడు ఉన్నాడు. ఎంతో కష్టపడి బ్రతుకుతున్న ఆ కుటుంబానికి రోడ్డు ప్రమాదాలు శాపంగా మారాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-తెనాలి

రూరల్ పరిధిలో శుక్రవారం సంభవించిన రెండు రోడ్డు ప్రమాదాలలో ఇరువురు వ్యక్తులు మతి చెందారు. రూరల్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం అంగలకుదురు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (29) ఆర్టీసీ బస్సు దిగి నడిచి వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన ట్రాలీ ఆటో ఢీకొంది. స్పందించిన స్థానికులు క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో ప్రమాదంలో దుగ్గిరాలకు చెందిన కార్పెంటర్ జాన్ వలి (51) బైక్ పై తినాలి వెళుతుండగా కంచర్లపాలెం సమీపంలో ఎదు రుగా వస్తున్న కారు ఢీకొంది ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన జాన్ వలి అక్కడికక్కడే మృతి చెందాడు. రెండు ఘట నలపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం మిస్సింగ్ కేసు నమోదైంది. తాడేపల్లి పట్టణంలోని నెహ్రూ బొమ్మ సెంటర్‌కు చెందిన బుర్రముక్కు సాంబిరెడ్డి ఈ నెల 8వ తేదీ నుంచి కనిపించడంలేదని సాంబిరెడ్డి భార్య తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాటాడుతున్న ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

చట్టానికి విరుద్ధంగా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని అర్బన్ సీఐ పి భాస్కర్ హెచ్చరించారు. పొన్నూరు రైలుపేట వివేకానంద విగ్ర హం సమీపంలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడు తున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి రూ.3,300ను స్వాధీన పరచుకొని కేసు నమోదు చేసినట్లు అర్బన్ సిఐ తెలిపారు.

'స్వేచ్ఛ కోసం కూటమి ఉమ్మడి అభ్యర్థులు'

ప్రజాశక్తి - మాచర్ల

జనసేన, బిజెపి, తెలుగుదేశం పార్టీల కూటమి అధికారంలోకి రాగనే వాక్ స్వాతంత్రం, స్వేచ్ఛ రాష్ట్ర ప్రజలకు అందుతాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్రనాయకులు చిరుమామిళ్ళ మధుబాబు అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని స్థానిక 2వ వార్డులో నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చిరుమామిళ్ళ మధుబాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ ఉంటుందన్నారు. తాము అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పెన్షన్ మొత్తం రూ 4 వేలకు పెంచి లబ్దిదారుల ఇళ్ళకు చేర్చుతామన్నారు. డ్రగ్స్, గంజాయి లాంటివి ఉండవన్నారు. కూటమిలోని 3 పార్టీల ఎజెండా ఎపి సమగ్ర అభివృద్ధి అని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, వై.కేశవరెడ్డి, విద్యాధరణి మురళి, కొమెర శివ, మంజుల ఆంజి, వీరు, వేణు, బండ్ల శ్రీనివాసరావు, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

PALNADU COLLEGE OF EDUCATION

(Recognised by NCTE, Govt of A.P & Affiliated to ANU)
NARAYANAPURAM, NADIKUDI, DACHEPALLI Mandal, Palnadu Dist.(A.P) -522414
Ph. No. Cell: 8897693893

NOTIFICATION FOR - CAT 'B' SEATS & SPOT ADMISSIONS
EDCET Code: PLND

Application are invited from eligible candidates for the academic year 2023-25 under Management seats Category B & SPOT admission seats into B.ED Course. Application forms can collect from College Office. EWS Seats are available (OC Students only)...

Last date of admissions : 03-04-2024

Dachepalli
28-03-2024 PRINCIPAL

స్వయంగా వెళ్లి పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్ర రెడ్డి

పెద్దమొత్తం పన్ను బకాయిల వసూలు

ప్రజాశక్తి - నరసరావుపేట

ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న సందర్భంగా నరసరావుపేట మున్సిపాలిటీలో పన్నులు వసూలు చేయడంలో మున్సిపల్ కమిషనర్ సి. రవిచంద్ర రెడ్డి చొరవ చూపిస్తున్నారు.పెద్ద మొత్తంలో పన్ను బకాయి ఉన్నవారి వద్దకు స్వయంగా తానే వెళ్లి వసూలు పన్నులు చేయడం జరుగుతుంది. ఇందులో భాగంగా శుక్రవారం కూడా బకాయి ఉన్న వారి వద్ద రూ.3.5 లక్షల పన్ను కట్టించి వారికి రశీదు ఇవ్వడం జరిగిందని తెలిపారు. మిగతావారు కూడా ఈ ఆర్థిక సంవత్సరానికి పన్ను బకాయి ఉన్న వారందరూ ప్రభుత్వం వారు కల్పించిన వడ్డీ రాయితీ తో పన్ను చెల్లించి పురపాలక సంఘం వారికి సహకరించాల్సిందిగా ప్రజలను కోరారు. అదేవిధంగా ఇంకా రెండు రోజులు మాత్రమే గడువు ఉన్నందున ప్రజలు త్వరగా వచ్చి పురపాలక సంఘంలో ఏర్పాటు చేసిన కౌంటర్లు వద్ద లేదా మొబైల్ కౌంటర్ల వద్ద పన్ను చెల్లించి తగు రశీదు పొందాలని, 31వ తేదీ ఆదివారం అయినప్పటికీ కూడా పురపాలక సంఘం,మొబైల్ కౌంటర్లు ఏర్పాటు చేస్తామని, ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఎపిఆర్‌డిసి మొదటి సంవత్సరం

ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

స్థానిక ఆంధ్రప్రదేశ్ గురుకుల డిగ్రీ కళాశాలలో 2024 - 25 వ సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరం ఎపిఆర్‌డిసి సెట్ - 2024 ప్రవేశ పరీక్ష దరఖాస్తుల గడువు ఈ నెల 31 నుంచి వచ్చే నెల ఏప్రిల్ 5 వరకు పొడిగించారు. ఈ విషయాన్ని ప్రిన్సిపల్ వైఎన్ఎస్ చౌదరి తెలిపారు. ఆసక్తి,అర్హత గల అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా వచ్చే నెల 5 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వచ్చే నెల 5-తరువాత గడువు పొడిగించరని పేర్కొన్నారు. డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షకు సంబంధించిన వివరాలు https://aprs.apcfss.in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. అలాగే ఎపిఆర్‌జెసి, ఎపిఆర్ఎస్ స్కూళ్లకు కూడా దరఖాస్తు తేదీ గడువును ఏప్రిల్ 5వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న రూరల్ సిఐ యు.సుధాకర్‌రావు

గొడవలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి-ఈపూరు

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ గ్రామాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా కేంద్ర బలగాలతో వనికుంట, శ్రీనగర్ గ్రామాలలో వినుకొండ రూరల్ సీఐ యు సుధాకర్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనగర్ గ్రామంలో సీఐ మాట్లాడుతూ ఎన్నికలు జరిగేలా గ్రామస్తులు సహకరించాలన్నారు. గొడవలకు పాల్పడి జీవితాలను చిన్నాభిన్నం చేసుకోవద్దని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే స్థానిక పోలీసులు దృష్టికి తేవాలన్నారు. ఆయనతోపాటు ఎస్సై షేక్ మహమ్మద్ ఫిరోజ్, ఏఎస్ఐ సాంబయ్య ఉన్నారు.

పేటలో పోరు.. గెలిచేదెవరు?

- ఇప్పటికే టిడిపి ప్రచారం ప్రారంభం.. ఇంకా ప్రారంభించని వైసిపి
- మార్పులు చేర్పులు ఎవరికి కలిసొస్తుందో?

చిలకలూరిపేట నియోజకవర్గంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పుల్లారావు, వైసిపి అభ్యర్థి మనోహరనాయుడు (ఫైల్)

ప్రజాశక్తి-చిలకలూరిపేట

సార్వత్రిక ఎన్నికల్లో చిలకలూరిపేట నియోజకవర్గం నుండి అధికార వైసిపి తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా కావటి మనోహర నాయుడుని, తెలుగుదేశం,జనసేన, బిజెపిల కూటమి ఉమ్మడి అభ్యర్థిగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు పోటీలో ఉన్న విషయం తెలిసిందే. దాదాపు పార్టీ 'బి' ఫామ్ వీరికే ఇస్తారని సమాచారం. ఆరోసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు ఇప్పటికే ప్రచారం ప్రారంభించారు. ఇక, మనోహర్ నాయుడు అయితే ఇంత వరకూ ఎన్నికల ప్రచారం ప్రారంభించలేదు. పల్లె, పట్టణాల్లో ఏ శుభకార్యమైనా, అశుభాకార్యమైనా, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు అందరి కంటే వీరే ముందుంటున్నారు. 2019లో జరిగిన ఎన్నికలు పరిశీలిస్తే ఆ ఎన్నికల్లో నోటాతో కలపుకుని మొత్తం 20 మంది అభ్యర్థులు పోటీలో వున్నారు. అయితే ప్రధానంగా వైసిపి తరపున విడదల రజిని, టిడిపి తరపున అప్పటికే ఎమ్మెల్యేగా (పేటకు మొదటి సారి మంత్రి పదవి తెచ్చిన వ్యక్తిగా) ఉన్న పుల్లా రావుని సిట్టింగ్ ఎమ్మెల్యేగా పోటీలో నిల బెట్టారు. ఈ ఎన్నికల్లో వైసిపి, టిడిపిల మధ్యనే పోటీ నడిచింది. వైసిపి తరపున విడదల రజినికు 93,458 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్లు 972 ఓట్లు మొత్తం 94,430 ఓట్లు వచ్చాయి. పుల్లారావుకు 85,523 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 606 మొత్తం 86,129 ఓట్లు లభించాయి. అంటే విడదల రజని 8,301 ఓట్ల అధిక్యంతో మాత్రమే గెలుపొందారు. ఈ ఎన్నికల్లో బెలూన్ గుర్తుపై పోటీ చేసిన ఇండిపెండెంట్ అభ్యర్థి కొచ్చర్ల శ్రీనివాసరావుకు 24 ఓట్లు రాగా, నోటాకు 897 (892 పోస్ట ల్ బ్యాలెట్ ,ఓట్లు 5 కలుపుకుని) వచ్చాయి. ప్రస్తుతం జరుగుతున్న అనేక చేర్పులు,మార్పులు కారణంగా త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనే విషయం సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఇవిఎంలు భద్రపరిచిన కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఎల్.శివ శంకర్

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా నరసరావుపేటలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న మార్కెట్ యార్డ్ గోదాములో భద్రపరిచిన ఈవిఎం మిషన్లను పలు రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్ శుక్రవారం తనిఖీ చేశారు. భద్రతాపరిస్థితులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, రెవెన్యూ డివిజనల్ అధికారి సరోజ, ఈవిఎం మిషన్ల నోడల్ అధికారి అజయ్ కుమార్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఆకస్మిక తనిఖీ చేశారు.

కడియాల కుటుంబానికి దక్కిన గౌరవం

డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు కోడలు, గొట్టిపాటి నరసయ్య కుమార్తె, డాక్టర్ కడియాల లక్ష్మీ గొట్టిపాటికి దర్శి అసెంబ్లీ టిడిపి టిక్కెట్

డాక్టర్ కడియాల లక్ష్మీ గొట్టిపాటి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

టిడిపి ఆవిర్భావం నుండి నరసరావుపేట నియోజకవర్గంలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు అనుచరునిగా, ప్రజా వైద్యునిగా పేరు తెచ్చుకున్న టిడిపి డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు కోడలు, గొట్టిపాటి నరసయ్య కుమార్తె,ప్రముఖ స్త్రీల ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ కడియాల లక్ష్మి గొట్టిపాటి కి ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం నుండి టిడిపి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చెం నాయుడు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా టిడిపి పల్నాడు జిల్లా కార్యాలయం వద్ద కడియాల అభిమానులు టపాసులు కాల్చి సంబరాలు జరిపారు. నరసరావుపేట,దర్శి నియోజకవర్గాలలో టిడిపి గెలుపునకు తమ వంతు కృషి చేస్తామని డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, కుమారుడు లలిత్ సాగర్ పేర్కొన్నారు. డాక్టర్ కడి యాల లక్ష్మీ గొట్టిపాటి మాట్లాడుతూ తన పుట్టింటి,మెట్టినింటి కుటుంబ సభ్యులు ఎన్నో ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నారని గుర్తుచేశారు. ప్రజా సేవ చేసి ప్రజల మన్ననలు పొందారని చెప్పారు. తన బాబాయి గొట్టిపాటి రవికుమార్ వరుసగా నాలుగు పర్యాయాలు అద్దంకి నుండి అత్యధిక మెజార్టీతో విజయం సాధించారని గుర్తుచేశారు. తండ్రి నరసయ్య స్ఫూర్తితో బాబాయి రవి కుమార్, మావయ్య డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు భర్త లలిత్ సహకారంతో దర్శి నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగురవేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

టిక్కెట్ దక్కక పోయినా పార్టీకి విధేయులమే..

డాక్టర్ కడియాల టిడిపి ఆవిర్భావం నుండి డాక్టర్ కడియాల పార్టీలో కొనసాగుతున్నారు. 2019 ఎన్నికలలో ఓటమి పాలైన డాక్టర్ చదల వాడ అరవింద బాబుకు కాకుండా అభ్యర్థిని మార్చే ఆలోచన ఉంటే తమకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానానికి కోరారు. అయితే ఇటీవల నరసరావుపేట టిక్కెట్ డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు కేటాయిస్తున్నట్లు అరవిందబాబు గెలుపునకు సహకరించాలని డాక్టర్ కడియాలకు సూచించారు. టిక్కెట్ దక్కక పోయినా పార్టీకి విధేయులమే అంటూ డాక్టర్ కడియాల డాక్టర్ చదలవాడ మద్దతు ఉంటుందని ప్రకటించారు. డాక్టర్ చదలవాడను కలిసి సత్కరించారు. అద్దంకి నియోజకవర్గం అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ కూడా కడి యాల కుటుంబానికి టిక్కెట్ ఇవ్వాలని పలుమార్లు అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లినట్లు చర్చ జరిగింది.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

పేదల జీవితాలను మార్చేవి ఈ ఎన్నికలు : మంత్రి

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

పేదల జీవితాలను మార్చే ఈ ఎన్నికల్లో, ఇప్పటి వరకు ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విధిగా తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతినాయకుడిపై ఉందని మంత్రి అంబటి రాంబాబు నాయ కులకు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక నియోజకవర్గ కార్యలయంలో గ్రామస్తాయి నాయకులతో ఏర్పాటు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశనికి రూరల్ పార్టీ కన్వీనర్ పురుషోత్తంఅధ్యక్షత వహించారు . అనంతరం మంత్రి మాట్లాడుతూ మండల పరిధిలోని కట్టావారపాలెంలోతాను ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో సంక్షేమం, అభివృద్ధి కలిపి రూ 15.63 కోట్ల నిధులు ఇప్పటికే అందించామన్నారు. .జరిగినప్రతి అభివృద్ధి పనిని ప్రజల్లోకి తీసుక వెళ్ళాల్సిన బాధ్యత నాయకులపై ఉందని సూచించారు. నియోజకవర్గంలో పారదర్శక పాలన అందిస్తున్నామని, ఏ వర్గానికి ఇబ్బందిలేకుండా ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించామన్నారు. క్షేత్ర స్థాయి నుండి ప్రతి కార్యకర్త , నాయకులు ఎన్నికల నిర్వహణలో భాగస్వామ్యం కావాలని చెప్పారు.

ముస్లిములతో చదలవాడ అరవిందబాబు, ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు

రొంపిచర్లలో టిడిపి ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మండల కేంద్రమైన రొంపిచర్లలో శుక్రవారం రాత్రి టిడిపి ఆధ్వర్యంలో రంజాన్ మాసంలో ఉపవాసం ఉంటున్న ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, కొల్లి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు వడియరాజుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక నరిశెట్టి కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం జరిగే మాచర్ల నియోజకవర్గ స్థాయి వడియరాజుల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేద్దామని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు అన్నారు. శుక్రవారం దుర్గారావు విలేఖరులతో మాట్లాడుతూ బిసిల అభివృద్ధికి, సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ హయాంలో ఎంతో కృషి జరిగిందన్నారు. తద్వారా వడ్డెరలకు టిడిపి ఆధ్వర్యంలో ఎంతో మేలు జరిగిందన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా నర్సరావుపేట కూటమి అభ్యర్థి లావు శ్రీక్రృష్ణదేవరాయులు, మాచర్ల అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మరెడ్డి పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశానికి వడ్డెరలు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

తాడేపల్లిలో మాట్లాడుతున్న ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ చిష్టి

మంగళగిరిలో సిపిఐ (ఎంఎల్) నాయకులను కలిసి మద్దతు కోరుతున్న సిపిఎం నాయకులు

మతోన్మాద బిజెపి, దానికి మద్దతిచ్చే పార్టీలను ఓడించాలి

రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది : ఆవాజ్

ప్రజాశక్తి-తాడేపల్లి

మతం పేరుతో దేశంలో ప్రజల మధ్య చీలికలు తెస్తున్న బిజెపి, దానికి మద్దతిస్తున్న ఎన్‌డిఎ కూటమి పార్టీలను ఓడించాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ చిష్టి పిలుపునిచ్చారు. శుక్రవారం తాడేపల్లిలోని ముగ్గురోడ్డు, ఒకటో వార్డుల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ విధమైన బలం లేని బిజెపికి వైసిపి, టిడిపి ఆక్సిజన్ అందిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళగిరిలో పోటీ చేస్తున్న 'ఇండియా' ఫోరం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గత పదేళ్లలో బిజెపి మతోన్మాద, కార్పొరేట్ రాజకీయాలను ఉధృతం చేసిందని, మైనార్టీలపై హలాల్, అజాన్, ఇజాబ్, గోరక్షణ తదితర పేర్లతో దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. బడ్జెట్లో ముస్లిములకు కేటాయింపులు తగ్గించారని, సంక్షేమ పథకాలు నిలిపివేయడంతో పాటు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు కుదించేశారని విమర్శించారు. పౌరసత్వ చట్టం పేరుతో ముస్లిముల ఉనికికే ప్రమాదం వచ్చి పడిందన్నారు. లౌకిక రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని, మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. మేకిన్ ఇండియా, మేడిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ఆత్మ నిర్భర భారత్, వికసిత్ భారత్ పేరుతో కార్పొరేట్లకు సేవ చేస్తున్నారన్నారు. జిఎస్‌టి పేరుతో రాష్ట్రాలకు రావాల్సిన ఆదాయంలో భారీ కోత విధించారన్నారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకొచ్చి వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేస్తున్నారన్నారు. నాలుగు లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక హక్కులను హరించి వేస్తున్నారని విమర్శించారు. ఇటువంటి దుర్మార్గమైన చట్టాలకు పార్లమెంట్‌లో వైసిపి, టిడిపి బిజెపికు అనుకూలంగా ఓటింగ్ చేస్తున్నాయని తెలిపారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు అటకెక్కించారన్నారు. దేశం, ప్రజల కోసం నికరంగా పని చేసే ఇండియా కూటమి అభ్యర్థులను రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, రూరల్, పట్టణ కార్యదర్శులు డి.వెంకటరెడ్డి, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

కార్పొరేట్, మతోన్మాద బిజెపిని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓడించడానికి వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులు కృషి చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య కోరారు. మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి వామపక్ష అభ్యర్థి పోటీ చేస్తారని, గెలిపించాలని కోరారు. ఈ మేరకు పట్టణంలోని రత్నాల చెరువులో సిపిఐ (ఎంఎల్) నాయకులు కూరపాటి కోటేశ్వరావు, దుర్గాప్రసద్‌ను శుక్రవారం కలిశారు. పదేళ్ల బిజెపి పాలనలో దేశంలో మత ఘర్షణలు, కుల ఘర్షణలు పెరిగిపోతున్నాయని చెప్పారు. నిత్యావసర సరుకులను ధరలను అదుపు చేయడం లేదని, ఇంధన ధరలను పెంచుతున్నారని అన్నారు. కార్పొరేట్ల కోసమే బిజెపి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే విధంగా పాలిస్తున్నారని, ఈ నేపథ్యంలో ఆ పార్టీని ఓడించడానికి వామపక్ష శక్తులన్నీ ఏకతాటి మీదకు రావాలని కోరారు. బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తున్న రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేనను ఓడించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, జెవి రాఘవులు, పి.బాలకృష్ణ, నాయకులు ఎం.బాలాజీ, ఇ.కాటమరాజు పాల్గొన్నారు.

నేడు మాలకొండారెడ్డి వర్ధంతి సభ

ప్రజాశక్తి-తాడేపల్లి

సిపిఎం నాయకులు వెన్నపూస మాలకొండారెడ్డి 21వ వర్ధంతి సభ శనివారం నిర్వహిస్తామని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాడేపల్లిలోని లీలా సుందరయ్య కళా వేదిక వద్ద సాయంత్రం ఐదు గంటలకు జరుగుతుందని పేర్కొన్నారు. సభకు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, తాడేపల్లి రూరల్ మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి హాజరవుతారని తెలిపారు.

ఉమేష్ చంద్ర విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డీఎస్పీ, సిఐలు

ఐపిఎస్ అధికారి ఉమేష్ చంద్రకు నివాళి

ప్రజాశక్తి-తెనాలి

ఐపిఎస్ అధికారి చదవాడ ఉమేష్‌చంద్ర 58వ జయంతిని ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం నిర్వహించారు. స్థానిక చెంచుపేటలోని ఉమేష్‌చంద్ర విగ్రహానికి డీఎస్పీ ఎం.రమేష్‌బాబు, సిబ్బంది నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విధినిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణ ఉమేష్‌చంద్రకే సొంతమన్నారు. పోలీసు శాఖకు ఆయన అందించిన సేవలను గుర్తు చేశారు. సిఐలు దశరథరామారావు, ఎస్.రమేష్‌బాబు, ఎ.సుధాకర్, ఉమేష్‌చంద్ర కుటుంబ సభ్యులు జాస్తి భుజంగేశ్వరరావు, డి,ఉమామహేశ్వరరావు, టి.శ్రీనివాసరావు, కె.రాజబాబు, వై.వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్కే కారు తనిఖీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఎన్నికల నేపథ్యంలో కాజ టోల్‌గేట్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం అటుగా వచ్చిన మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

జాషువా సమాధి వద్ద నివాళులర్పిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్, బి.రామాంజనేయులు తదితరులు

అవమానాల నుంచి పుట్టిన గళమే జాషువా

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఎన్నో అవమానాలను, అవహేళనలను దిగమింగుకొని జాషువా తన గళాన్ని కవితల రూపంలో ప్రపంచానికి అందించారని గుంటూరు పార్లమెంట్ టిడిపి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా గుంటూరు నగరం ఆనందపేటలోని క్రైస్తవ సమాధులలో మహాకవి గుర్రం జాషువా సమాధి వద్దకు వెళ్లిన డాక్టర్ పెమ్మసాని పూలమాలలు వేసి జాషువాకు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో నేటికీ కొందరు దళితులు అవమానాల పాలవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం మీదే అందరూ ఆధారపడకుండా ప్రతి ఒక్కరూ తమ సొంత కాళ్లపై నిలబడ్డరోజే సామాజికంగా ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరుకోగలరని, తద్వారా నలుగురిని శాసించే స్థాయికి చేరుకోగలరని చెప్పారు. జాషువాకు నివాళులర్పించిన వారిలో టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు, మైనార్టీ సెల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మ్యాని, ఇతర నాయకులు ఉన్నారు.

అర్జీలు పరిష్కరించాలంటే ముడుపు కట్టాల్సిందే!

ప్రజాశక్తి - తాడికొండ

దరఖాస్తులు పెట్టుకోవాలన్నా సర్టిఫికెట్లు పొందాలన్నా ఆ అధికారికి పైకం చెల్లించాల్సిందే. ఓ మండల స్థాయి రెవెన్యూ అధికారి సామాన్య ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని జేబులు నింపుకుంటున్నారు. ఆ అధికారిపై రోజుకో రకంగా అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ప్రజలు వీఆర్వోలను సంప్రదించి దరఖాస్తులు పెట్టుకుంటారు. వాటిని వీఆర్వో పరిశీలించి పై అధికారులకు పంపుతుంటారు. అయితే ఓ అధికారి వచ్చినప్పటి నుండి తమకు తెలియకుండా ఏ విధమైన అర్జీలు పెట్టడానికి వీలులేదని వీఆర్వోలకు అనధికార ఆదేశాలందాయి. ప్రజల వద్ద నుండి నేరుగా దరఖాస్తులు అందుకుంటూ బేరాలు కుదుర్చుకున్న తరువాతనే సంతకాలు పెట్టాలని, తమకు తెలలియకుండా విచారణకు సైతం వెళ్లరాదని చెప్పారు. దరఖాస్తులను సంబంధిత ఆధారాలను తీసుకొని తన అసిస్టెంట్లతో నేరుగా మీ-సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేయించి దీనికి ఎంత రేటు ఇవ్వగలవు? అంటూ ప్రజలను సూటిగా అడుగుతున్నారు. దీంతో వీఆర్వోలకు తెలియకుండానే స్థానికులు ఆప్లికేషన్లు పెట్టుకోవడం, మంజూరు చేయడం నిరంతర ప్రక్రియగా మారింది. వారసత్వ ఆస్తులను పొందుటకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అవసరం అవుతుంది. ఈ సందర్భాల్లో వారి అవసరాలను బట్టి రేటును మాట్లాడుకుంటున్నారు. అధికారి అడిగినంత డబ్బులు ఇవ్వపోతే ఏదో ఒక వంక చూపి నెలల తరబడి ప్రజలను తన చుట్టూ తిప్పుకుంటున్నాడు. విచారణ చేయకుండా మంజూరు చేసిన సర్టిఫికెట్లతో ప్రజలు తీవ్రమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై తాడికొండ మండలం లాంకు చెందిన సర్వేనెం 278 నందు 9 సెంట్ల ప్రభుత్వ భూమిని చదును చేయించి రోటావేటర్ వేయించినట్లు సమాచారం. ప్రభుత్వ భూములు కాపాడాల్సిన అధికారులే ఆక్రమణకు సహకరించడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మున్సిపల్ స్కూల్ భవనంలోకి పోలింగ్ కేంద్రం తరలింపు

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

స్థానిక పురపాలక సంఘం పరిధిలోని ఎనిమిదవ వార్డు క్యాబిన్‌పేటలో ఉన్న డాక్టర్ అంబేద్కర్ మెమోరియల్ ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూలులో ఉన్న 219 పోలింగ్ కేంద్రాన్ని స్థానిక ఎన్నికల అధికారులు క్యాబిన్‌పేట పాత మున్సిపల్ ఎలిమెంటరీ స్కూలు భవనంలోకి ఇటీవల తరలించారు. గతంలో 219 పోలింగ్ కేంద్రంగా నిర్వహించిన డాక్టర్ అంబేద్కర్ మెమోరియల్ ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూలు 2021-22 విద్యా సంవత్సరంలో మూసివేశారు. దరిమిల 219 పోలింగ్ కేంద్రంలో కొద్దిపాటి మరమ్మతులను స్థానిక మున్సిపల్ అధికారులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మున్సిపల్ కమిషనర్, ఎఇఆర్ఒ నయీమ్ అహ్మద్ మాట్లాడుతూ ఈ పోలింగ్ కేంద్రంలో 714 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు.

రోడ్డుపైకి మురుగు నీరు

- మందకొడిగా కాల్వల మరమ్మతులు
- గణపవరం వెళ్లే మార్గంలో వాహనచోదకులకు ఇబ్బంది

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేటలో మురుగునీరు రోడ్డు పైకి చేరుతుండటంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక నరసరావుపేట సెంటర్, ఎఎంజి దగ్గర నుంచి కొత్త మార్కెట్ యార్డు ఎదురుగా గల రోడ్డు వెంబడి, గణపవరానికి ముందు ఉన్న కుప్పగంజి వాగులో ఈ మురుగు నీరు కలుస్తోంది. దీంతో, ఆ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. కాల్వల మరమ్మతుల నిమిత్తం ఆ మురుగునీటిని గణపవరం వెళ్లే రోడ్లపైకి వదలడంతో వాహనచోదకులు, ప్రజలకు ఇబ్బంది తప్పట్లేదు.

పట్టణం నుంచి గణపవరం, నాదెండ్ల గ్రామాలకు నిత్యం వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలపై వెళుతుంటారు. ప్రజలు, కూలీలు రాత్రి, పగలు ఎదో పను ల నిమిత్తం ఇదే రోడ్డు పై వెళుతుంటారు. గత వారం రోజు లుగా ఆ రోడ్డుపై వెళ్లే వారికి ఇబ్బందులు తప్పట్లేదు. మురుగు నీరు నిండుగా ఉండటంతో రోడ్లపై గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి. దీంతో, వాహన చోదకులు ప్రమా దాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి గుంతలను పూడ్చి మురుగునీరు పోవడా నికి ప్రత్యామ్నాయ మార్గాలు చేయాలని వారు కోరుతున్నారు.

చిలకలూరిపేట నుంచి గణపవరం వెళ్లే మార్గంలో మురుగునీరు

ఎంపి శ్రీకృష్ణ దేవరాయులకు రుణపడి ఉంటాం

మత్స్యకారుల మాజీ ప్రెసిడెంట్ ఎరిపల్లి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల మండలం విజయపురిసౌత్ లోని సాగర్ క్యాంపు,డౌన్ మార్కెట్ మత్యకారుల కాలనీలను నరసరావుపేట ఎంపి శ్రీకృష్ణదేవరాయులు దత్తత తీసుకోవడంపై మత్స్యకారుల సంఘం మాజీ అధ్యక్షుడు ఎరిపల్లి వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం విజయపురిసౌత్ లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.సాగర్ డ్యామ్ నిర్మాణ సమయం నుంచి అభివద్ధికి నోచుకోని మత్యకారులకు అండగా నిలిచిన శ్రీకృష్ణదేవరాయులును,జూలకంటి బ్రహ్మారెడ్డిని రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని చెప్పారు. సమావేశంలో ఎం.అప్పలరాజు,చేపల భూలోక, దేవుడు ఓసుపల్లి రాజారావు, యజ్జల ఏసుబాబు, పెంటిబోయిన నూకరాజు, జనసేన నాయకుడు చరణ్, అశోక్, మైలపల్లి సత్యారావు,యజ్జల శ్రీను,కారే గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసమే పొత్తు'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

సామాజిక మాధ్యమాలలో వచ్చే తప్పుడు ప్రచారాల పట్ల అప్రత్తంగా ఉండాలని జనసే న పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో - కన్వీనర్ పెంటేల బాలాజీ అన్నారు. స్థానిక పండరీపురంలో నితన కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఉ జ్వల భవిష్యత్తు కోసం ఏర్పడిన తమ కూటమి పొత్తు ధర్మాన్ని పాటిస్తూ ఉమ్మడి అభ్యర్థి ప్రత్తి పాటి పుల్లారావును గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో అనేక సమస్యలు అపరిష్కతంగా ఉన్నాయని,వాటి పరి ష్కారానికి పుల్లారావు కృషి చేస్తారని తెలిపారు. ఐదేళ్ల కాలం లో నియోజకవర్గంలో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం కొనసాగలేదని, వైసిపి పాలనలో ఇసుక, మట్టి, గ్రావెల్ దోపిడి పెరిగి సహజ వనరులను సైతం దోచుకున్నారని విమర్శించారు. వైసిపి సామాజిక మాధ్యమాలు వేదికగా చేస్తున్న తప్పుడు ప్రచారాలపై నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వినుకొండను అవినీతి రహితంగా మార్చాలి

ప్రజాశక్తి-వినుకొండ

నియోజకవర్గాన్ని అవినీతిరహితంగా తీర్చిదిద్దాలన్నా, బొల్లా లాంటి వారి కబంధ హస్తాల నుంచి విడిపించి స్వేచ్ఛను పొందాలంటే తెలుగుదేశం పార్టీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు విజయంతోనే సాధ్యమని శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్, ఆయన భార్య లీలావతి అన్నారు. వినుకొండను అవి నీతి రహిత నియోజకవర్గంగా మార్చాలంటే ప్రజలందరూ వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓట్లు వేసి జీవీని గెలి పించాలని కోరారు. జీవీ తరపున ఇంటింటికీ విస్తృత ప్రచారంలో భాగంగా శుక్రవారం స్థానిక 27వ వార్డులో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా లీలావతి సమక్షంలో 25 కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలో చేరాయి. అనంతరం ఏర్పాటు చేసిన సభలో లీలావతి మాట్లాడారు.

ముప్పాళ్ల మండలంలో టిడిపి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇరుకుపాలెం, రుద్రవరం,తొండపి,దమ్మాలపాడు,బొల్లవరం, గోళ్ళపాడు, కుందురువారిపాలెం, ముప్పాళ్ళ, లంకెలకూరపాడు,పలుదేవర్లపాడు గ్రామాల్లో సత్తెనపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ,నర్సారావుపేట ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు శుక్రవారం పర్యటించారు. లక్ష్మీనారాయణ, శ్రీకృష్ణదేవరాయలు సమక్షంలో మండలంలో వైసిపి నుంచి టిడిపి లోకి భారీగా చేరికలు జరి గాయి. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వ్యక్తిని కాదు అభివృద్ధిని చూసి ఓటు వేయాలని, అభివృద్ధి చేస్తాం అనుకుంటేనే ఓటు వేయాలని కోరారు. గత ప్రభుత్వంలో అన్ని సంక్షోభాలేననీ,ఆర్థికంగా వెనుకబడింది మన రాష్ట్రమేనని, తిరిగి అభివృద్ధి సాధించడం తమ కూటమితోనే సాధ్యమన్నారు. శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో వ్యవసాయం ఆధారం కనుక లిఫ్ట్ ఇరిగేషన్ వరికపుడిసెల ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు,తెలుగుదేశం,జనసేన నాయకులు రావిపాటి మధుబాబు,గోగినేని కోటేశ్వరరావు, శిరిగిరి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

'యువతను మోసం చేసిన జగన్'

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

యువతను మోసం చేసిన జగన్ రెడ్డిని గద్దె దించి చంద్రబాబు ను ముఖ్యమంత్రిని చేసే బాధ్యత యువతదేనని సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షులు చిన్నబోయిన రాఘవరావు రూపొందించిన తెలుగు యువత ఎన్నికల కరపత్రాన్ని నర్సరావుపేట పార్లమెంటు అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలిసి కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం ఆవిష్కరించారు.

టిడిపి జెండా ఎగురవేస్తున్న జివి ఆంజనేయులు

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో టిడిపి 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జివి ఆంజనేయులు, నరసరావుపేట టిడిపి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి. కార్యాలయ ప్రాంగణంలో టిడిపి జెండా ఎగురవేసి అభిమానులకు మిఠాయిలు పంచి పెట్టారు. దివంగత ఎన్టీఆర్, డాక్టర్ కోడెల విగ్రహాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. ఆంజనేయులు, అరవిందబాబు మాట్లాడుతూ వైసిపి తన ఐదేళ్ల పాలనలో ప్రజా వ్యతిరేకతను మూట గట్టుకుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, యువ నాయకులు డాక్టర్ లలిత్ సాగర్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు, తెలుగుయువత నాయకులు కుమ్మెత కోటిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే

ప్రజాశక్తి - మాచర్ల

గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం స్థానిక బాప్టిస్టు చర్చిలో జరిగిన కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చినఏసోబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలోని మండలంలో అన్ని గ్రామాల్లో చర్చిలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఫాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణం, మండలం, రొంపిచర్ల మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రార్థన మందిరాలలో క్రైస్తవులు పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొన్ని గ్రామాలలో ర్యాలీ నిర్వహించి ఏసుక్రీస్తు వేషధారణలతో శిలువ మోయటం విశేషంగా ఆకట్టుకుంది.

ప్రజాశక్తి -కారంపూడి

మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలోని ఫాదర్ హయ్యర్ లూథరన్ చర్చిలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు కోట జక్రయ్య, కోట. దేవదాసు, కందుకూరి. బాబు, గుంటగాని దేవ సహాయం, ఆదాం, చిన్న యాకోబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

స్థానిక ఆర్‌సిఎం చర్చి ఆధ్వర్యంలో కల్వరి సిలువ యాత్ర ప్రదర్శన నిర్వహించారు గ్రామం వీధుల్ల.. హైవే సర్వీస్ మార్గం మీదుగా ఎర్ర కొండ వద్దకు ఈ యాత్ర కొనసాగింది. కొండపై ఉన్న రహదారి మాత వద్దకు చేరుకొని గుడ్ ఫ్రైడే సందర్భంగా చర్చి ఫాదర్ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. అనంతర భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లోని చర్చిలలో గుడ్‌ఫ్రైడే నిర్వహించారు. ఈసందర్భంగా కొమెరపూడి లో సిలువ యాత్ర నిర్వహించారు. ఫాదర్ రాజేష్ దీక్షా పౌరులతో కలిసి గ్రామంలో సిలువ యాత్ర చేశారు. చర్చిలలో పానకం పంపిణీ చేశారు.

ప్రజాశక్తి-పెదకూరపాడు

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పెద కూరపాడు టిడిపి కార్యాలయంలో నిర్వ హించారు. గ్రామ టిడిపి అధ్యక్షుడు చెన్నుపాటి బుల్లి బాబుతో కలిసి పార్టీ జెండాను పెదకూరపాడు మండల టిడిపి అధ్యక్షులు అర్తిమళ్ల రమేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బెల్లంకొండ రామ్ గోపాల్ రావు, గల్లా బాబు, మిలటరీ మౌలాలి, జాగర్లమూడి రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూల మాలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొల్లా వెంకట కోటయ్య, పల్నాడు జిల్లా టిడిపి అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, మండల పార్టీ అధ్యక్షులు టి. బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
7
గుంటూరు జిల్లా
శనివారం 30 మార్చి 2024

కెఎల్‌యులో ముగిసిన 'ఆత్రోబ్-24' యువజనోత్సవాలు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్ యూనివర్సిటిలోని బిఎ, ఐఎఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సాహిత్య, విజ్ఞాన, సాంస్కృతిక యువజనోత్సవాలు ఆత్రోబ్-2024 శుక్రవారం ఘనంగా ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన వర్సిటీ డీన్.డాక్టర్ ఎం.కిషోర్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాల్లోని విజ్ఞానాన్ని చదివితే సరిపోదని, జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలంటే నిబద్ధత, ఆత్మవిశ్వాసం, ఓర్పు, నిర్వహణా సామర్థ్యాలు, సంభాషణా నైపుణ్యాలు ఎంతో అవసరమని అన్నారు. దుష్ప్రవర్తనకు, దుష్ప్రచారాలకు దూరంగా మెలగుతూ ప్రతి విషయంలోనూ సానుకూల దృక్పథాన్ని పెంపొందించుకున్నప్పుడే లక్ష్యాన్ని సులభంగా చేరుకోగలమని చెప్పారు. బిఎ, ఐఎఎస్ విభాగాధిపతి డాక్టర్ బి.శివనాగయ్య మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం నుండి ఎంఎ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పబ్లిక్ పాలసి, ఎంఎ డిజిటల్ హ్యుమానిటీస్ అనే రెండు కొత్త కోర్సులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఎకనామిక్స్, ఇండియన్ పాలిటి, ఇంగ్లీష్ లిటరేచర్, చరిత్ర వంటి అంశాలను మేజర్, మైనర్ పాఠ్యాంశాలుగా యుపిఎస్‌సి సిలబస్‌ను దృష్టిలో పెట్టుకుని పాఠ్య ప్రణాళికలను రూపొందించామన్నారు. బిఎతో పాటుగా ఎంఎ కోర్సులు కూడా ఐఎఎస్ ఓరియెంటేషన్‌తో నిర్వహింబడతాయని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన గ్రంథాలయ ఆచార్యులు డాక్టర్ కె.తాతారావు మాట్లాడుతూ ప్రతిరోజూ వ్యాయామం, వార్తాపత్రికా పఠనం, ఆయా పాఠ్యాంశాలకు సంబంధించిన యోజన, కాంపిటేటివ్ సక్సెస్, కురుక్షేత్ర, ఎకనామిక్ టైంస్ వంటి మేగజైన్‌లు చదవడం దినచర్యలో భాగంగా చేసుకుంటే సివిల్ సర్వీసెస్ సాధించటం సులభమవుతుందని చెప్పారు. ఇదిలా ఉండగా 14 అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ స్థానలను సాధించిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి కెఎల్‌యు విద్యార్థులతో పాటు వివిధ కళాశాలల నుండి సుమారు 500 పైగా హాజరయ్యారు. వారి ఆటపాటలతో ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.అనిల్ కుమార్, డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, డాక్టర్ బాలాజీ మానసారావు, డాక్టర్ ఆర్.సాయికుమార్, విద్యార్థి కో-ఆర్డినేటర్లు స్వామి, అశోక్ పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనిలస్తున్న బిఎ ఐఎఎస్ విద్యార్థులు

ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలేస్తున్న నాయకులు

ఘనంగా టిడిపి వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - మంగళగిరి

టిడిపి వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్‌టి రామారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టే సమయంలో టిడిపిని ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ ఎన్నికల్లో ఘన విజయం సాధించారని చెప్పారు. అదే స్ఫూర్తితో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపిని ఓడించాలన్నారు. ఎన్.అబద్దయ్య, జి.ధనుంజయరావు, డి.రాజు, కె.అంకమ్మరావు, వి.ఆశాబాల, టి.జానకిదేవి, షేక్ రియాజ్, వి.మైనర్‌బాబు, టి.పార్థసారథి, ఎం.వెంకట్రావు పాల్గొన్నారు.

తుళ్లూరులో టిడిపి ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

'కూటమి గెలుపునకు కృషి చేద్దాం'

ప్రజాశక్తి - తుళ్లూరు

వచ్చే ఎన్నికలలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టిడిపి నాయకులు దామినేని శ్రీనివాసరావు, కాటా అప్పారావు కోరారు. మండల కేంద్రమైన తుళ్లూరులో శుక్రవారం టిడిపి 43 వ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక టిడిపి కార్యాలయంలో జెండా ఎగురవేశారు. ఎన్టీఆర్ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అమరావతి రాజధాని నిర్మాణం, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని నాయకులు చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఎంపి, ఎమ్మెల్యేలుగా పోటీ చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి శ్రావణ్‌కుమార్ గెలుపునకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. బండ్ల శ్రీనివాసరావు, ఇందుర్తి నరసింహారావు, జె.ఏడుకొండలు, మేకల చిన్నాబ్బాయి, మేరిగ నాగేశ్వరరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కుంచనపల్లిలోని టిడిపి మండల కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు ఆధ్వర్యంలో టిడిపి 42వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. జెండాను అమర సుబ్బారావు ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని కాపాడేందుకు నందమూరి తారక రామారావు టిడిపిని స్థాపించారని అన్నారు. అదేవిధంగా పేద, బడుగు, బలహీన వర్గాలకు టిడిపి అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు సామల నాగేశ్వరావు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, గుంటూరులో పార్లమెంట్ అధికార ప్రతినిధి పటాన్ ఖాసింఖాన్, టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దొప్పలపూడి జ్యోతిబసు, కుంచనపల్లి గ్రామ టిడిపి అధ్యక్షులు కానుగోలు కోటేశ్వరరావు, జనసేన గ్రామ అధ్యక్షులు మేకల రాజా, సొంటి కళ్యాణి, తోట సాంబశివరావు, దాశెట్టి అరుణ, పాల్గొన్నారు.

'గెలిచిన వెంటనే సమస్యల పరిష్కారం'

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

టిడిపి, జనసేన, బిజెపి కూటమి టిడిపి అధికారంలో రాగానే సమస్యలను పరిష్కరిస్తానని పొన్నూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్రకుమార్ చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పొన్నూరు పట్టణంలోని 19వ వార్డులో కూటమి పార్టీల నాయకులతో కలిసి నరేంద్ర శుక్రవారం పర్యటించారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాల గురించి కరపత్రాలను పంపిణీ చేశారు. వార్డులోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటికి చాలా ఇబ్బంది పడుతున్నామని, చాలా దూరం వెళ్లాల్సి వస్తుందని స్థానికులు చెప్పారు. మున్సిపాలిటీ పంపులు ఏర్పాటు చేసి నీటి సమస్య లేకుండా చూడాలని కోరారు. శ్మశాన స్థలం సరిపోవటం లేదన్నారు. ఇంటి నిర్మాణాలకు రుణాలు మంజూరు చేయించాలన్నారు. అధికారంలోకి రాగానే ఈ సమస్యలన్నీ పరిష్కరిస్తామని స్థానికులతో నరేంద్ర చెప్పారు. ఇదిలా ఉండగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. ఎన్‌టిఆర్, ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామంలో సిలువ దారి వేషధారణ ప్రదర్శనలు

పట్టణం, గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

ప్రజాశక్తి - తెనాలి

గుడ్ ఫ్రైడే ఆరాధనలు పట్టణంలో పలు దేవాలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక చెంచుపేట మేరిమాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు సిలువ యాత్రను ప్రదర్శించారు. ఫాదర్స్ కోయ స్లీవ, విజయకుమార్, విన్సెంట్ వాక్యోపదేశం చేశారు. బోస్ రోడ్డులోని క్రీస్తు దేవాలయంలో ప్రత్యేక ఆరాధనల్లో రెవరెండ్ దేవరపల్లి యేసురత్నం, యామర్తి లెనిన్‌బాబు, దగ్గుమల్లి సాల్మన్ రాజు, ప్రకాష్‌బాబు వి.జె.మత్తే సందేశం ఇచ్చారు.

ప్రజాశక్తి దుగ్గిరాల

మండలంలోని వివిధ గ్రామాల్లో గుడ్ ఫ్రైడేను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు ఉదయం నుండి రోజంతా ఉపవాసాలు ఉండి ప్రార్థనలు గడుపుతున్నారు. వివిధ గ్రామాల్లో సిలువ దారి వేషధారణలో ప్రదర్శనలు నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

చర్మ వ్యాధులపై రేపు ఆరోగ్యసభ

ప్రజాశక్తి-గుంటూరు : అవగాహన ఆధ్వర్యంలో ఈనెల 31న ఆదివారం ఉదయం 11 గంటలకు స్థానిక అరండల్‌పేట 15/1లోని సంస్థ కార్యాలయంలో చర్మవ్యాధులు-చికిత్సపై ఆరోగ్య సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభలో ప్రముఖ చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ పివికెఆర్ రామకృష్ణ, యోగా, ధ్యాన నిపుణులు వివి.రావ్‌లు ప్రధాన వక్తలుగా పాల్గొంటారని పేర్కొన్నారు.

నాగులపాడు పుట్ట వద్ద నేడు

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - పెదనందిపాడు

శ్రీ శృంగేరి శారదా పీఠ పాలిత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయాల సముదాయం నాగులపాడు పుట్ట ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో నాగులపాడు పుట్ట వద్ద ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహిస్తామని దేవస్థానం పాలక మండలి అధ్యక్షులు గొల్లపూడి సాంబశివరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం ఉంటుందని, ముఖ్యఅతిథిగా పిఠాపురం సివిల్ కోర్టు జడ్జి ముత్తవరపు సుధారాణి హాజరవుతారని చెప్పారు. కంటి పరీక్షల కోసం శిబిరానికి వచ్చేవారు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు జిరాక్స్ కాపీలను తెచ్చుకోవాలని సూచించారు. శుక్లాల ఆపరేషన్‌కు ఎంపిక చేసిన వారికి పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా చేస్తారని తెలిపారు. క్యాంపునకు హాజరయ్యే వారికి భోజన సదుపాయం ఉంటుందన్నారు.

11వ వార్డులో లావణ్య ప్రచారం

ప్రజాశక్తి - మంగళగిరి

వైసిపి మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి మురుగుడు లావణ్య శుక్రవారం మంగళగిరి పట్టణంలోని 11వ వార్డులో ఎన్నికల ప్రచార నిర్వహించారు. ఓటర్లను కలిసి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను చెప్పి ఓట్లు అభ్యర్థించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహన్‌రావు, నాయకులు ఎం.మల్లేశ్వరరావు, ఎం.సుధారాణి, ఎమ్‌డి ఫిరోజ్, ఎం.సత్యం పాల్గొన్నారు.

ప్రచారంలో మురుగుడు లావణ్య, ఎమ్మెల్సీ హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే, తదితరులు

తనిఖీలు చేస్తున్న స్క్వాడ్ బృందాలు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలు విధిగా పాటించాలని, సమావే శాలకు, ర్యాలీలకు రిటర్నింగ్ అధికారి నుండి అనుమతులు పొందాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) కీర్తి చేకూరి శుక్రవారం తెలిపారు. నిబందనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే ఎంసిసి, ఎఫ్ఎస్టి, ఎస్ఎస్టీ, విఎస్టీలు విస్తృతంగా పర్యటి స్తున్నాయని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేస్తున్నా మని, రాజకీయ పార్టీలు కూడా ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవ హరిస్తూ సహకరించాలని కోరారు. ఇప్పటికే 24 గంటలు అందుబాటులో ఉండేలా 3 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, షిఫ్ట్‌కి 3 బందాలుగా ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాస్టిక్ సర్వైన్స్, వీడియో సర్వైలెన్స్ టీంలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి బృందంలో గెజిటెడ్ ఉద్యోగి పర్యవేక్షణలో పోలీ సులు, వీడియోగ్రాఫర్లు ఉంటారన్నారు. ఆయా బృందాల విధులను పర్యవేక్షణ, రిపోర్టింగ్ కోసం జిఎంసి ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా సీనియర్ అధికారులను నియమిం చామని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజ కవర్గంలో అనుమతి లేకుండా తరలిస్తున్న ఎన్నికల ప్రచార సామాగ్రిని సీజ్ చేసి ఎఫ్ఐఆర్ బుక్ చేశామని, రాజకీయ పార్టీల ప్రకటనలు ఉన్న బైక్, విద్యా సంస్థ బస్‌ల యజమా నులపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయించామని తెలిపారు. గురువారం నాటికి వివరాలు చూపని రూ.7,62,850 నగదు సీజ్ చేసినట్లు వెల్లడించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు గానీ, అభ్యర్థులుగాని ప్రచార వాహనాలు, ర్యాలీలు, సామాగ్రి, సభలకు సువిధయాప్ ద్వారా 48 గంటల ముందు దరఖాస్తు చేసుకు ంటే తగిన అనుమతులను మంజూరు చేస్తున్నా మన్నారు. అనుమతులు లేకుండా ప్రచారాలు చేస్తే ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకోక తప్పదని స్పష్టం చేశారు.

ఇవిఎంల తరలింపు వాయిదా

రాష్ట్ర ఎన్నికల సంఘం గుంటూరు నగరపాలక సంస్థకు కేటాయించిన ఇవిఎంలను బాపట్ల జిల్లా నుండి గుంటూరుకు శనివారం తరలించాల్సి ఉండగా, ఈ ప్రక్రియ సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడిందని నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తరలింపు తేదీ ఖరారైన వెంటనే తెలియజేస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్ని చేర్పించండి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడానికి ప్రత్యేక డ్రైవ్‌ని ఉపాధ్యాయులు నిర్వహించాలని యుటిఎఫ్ పిలుపునిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. బ్రాడీపేటలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు తరం నైతిక విలువల తో, మానవ సంబంధాలను అభివృద్ధి చేసుకోవా లన్నా, రాజ్యాంగ విలువలను పరిరక్షించుకో వాలన్నా, మానవత్వం విలువలు పరిమళించా లన్నా ప్రభుత్వ విద్యా రంగం అభివద్ధి కావాలని వివరించారు. విద్యారంగ సంస్కరణ పేరుతో ప్రభుత్వం తెచ్చిన విధానాలు, పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చి కించపరుస్తున్నా, వాటికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూనే ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించు కోవడం, తల్లిదండ్రులతో కలిసి ముందుకు నడవటం ఉపాధ్యాయుల కర్తవ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులపై తల్లిదండ్రులు నమ్మకంగా ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్న విద్యార్థులకు సామర్థ్యం ఆధారిత బోధన చేయటం ప్రధాన పనిగా ఉండాలని కోరారు. ఏప్రిల్ 23తో పాఠశాల పనిదినాలు పూర్తికావస్తున్నాయని, ఈలోపే ప్రతి ఉపాధ్యాయుడు తమ ప్రాంతంలో బడిఈడు ఉన్న పిల్లలను గుర్తించి, బడిలో చేర్పించాలని కోరారు. తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులను చేర్చాలని కోరారు. పాఠశాల విద్యా వ్యవస్థను అస్తవ్యస్థం చేసిన జీవో నెంబర్ 117ను సమీక్ష చేయాలని, దాని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎఎన్.కుసుమకుమారి, రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ హనుమంతరావు మాట్లాడుతూ పాత పెన్షన్‌ని (ఓపిఎస్) పునరుద్ధరించాలని జిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ ఇచ్చే వారికి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు రాబోయే ఎన్నికల్లో బలపరచాలని కోరారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జరుగుతున్న స్పాట్ కేంద్రాల్లో ఉపాధ్యాయులకు కనీస సౌకర్యాలు కల్పించాలనిన్నారు. అలాగే గతంలో రెనిమినేషన్‌కు సంబంధించిన అమౌంట్ కొన్ని జిల్లాల్లో జమ కాలేదని, వెంటనే వాటిని జమ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యుటిఎఫ్ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల ప్రధాన కార్యదర్శులు ఎం.కళాధర్, జి.విజయసారథి, ఎ.శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా అధ్యక్షులు జె.వినయ్‌కుమార్, గుంటూరు జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఈనెల 31 వరకే వడ్డీ రాయితీ గడువు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయి ఏకమొత్తంగా చెల్లించిన వారికి కల్పించిన వడ్డీ రాయితీ గడువు ఈ నెలాఖరు వరకే ఉందని, పన్ను బకాయిదార్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఏప్రిల్ 1నుండి పన్నుపై వడ్డీ జమ అవుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయి అంతా ఏక మొత్తంగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీ ప్రకటించిందని, నగర పజలు ఈ నెలాఖరులోపు తమ ఆస్తి, ఖాళీ స్థల పన్నులు పూర్తిగా చెల్లించి వడ్డీ రాయితిని పొందాలని సూచించారు. నెలాఖరు వరకు వేచి చూడకుండా ముందుగానే పన్ను చెల్లించాలని, నెలాఖరులో సర్వర్‌లో సాంకేతిక సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఏప్రిల్ 1 నుండి పన్నుపై వడ్డీ యథావిధిగా జమ అవుతుందని, బకాయిదార్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని తెలిపారు. పన్ను చెల్లింపుదార్లకు వీలుగా సెలవు రోజుల్లోనూ జిఎంసి క్యాష్ కౌంటర్లు పనిచేస్తాయని తెలిపారు.

పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ముస్లిముల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న అంబటి రాంబాబు

గుంటూరు జిల్లా తెనాలిలో హోటల్ - ఫుడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్

ఊపందుకుంటున్న ప్రచారం

ఆత్మీయ సమావేశాలతో ఆకట్టుకునే ప్రయత్నం - వివిధ సామాజిక తరగతులతో అభ్యర్థుల ముఖాముఖి చర్చలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఎన్నికలల్లో గెలిచేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు వివిధ రకాల ఎత్తుగడలను అవలంబిస్తున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 14 అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలకు మే 13న జరగనున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వివిధ రకాల ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. రోజుమొత్తంలో కొంత సమయం ప్రచారానికి కేటాయించి మిగతా సమయంలో వివిధ సామాజిక తరగతుల నేతలతో మంత్రాంగం చేస్తున్నారు. సామాజిక తరగతుల వారితో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆయా సామాజిక తరగతులు, కులాలకు సంబంధించిన వారి సమస్యలను విని, ఎన్నికల్లో గెలవగానే మీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నారు. కొన్ని సంఘాల నాయకులకు తక్షణం భవన నిర్మాణాలు, ఇతర అవసరాల కోసం కొంత విరాళం కోరుతుండగా వెంటనే ఇచ్చే ప్రక్రియను కూడా చేపట్టారు.

గత ఎన్నికల్లో తమకు ఎవరు మద్దతు ఇవ్వలేదో ఆ సామాజిక వర్గాలను ఆకట్టుకునేందుకు ఈసారి ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయా గ్రామాల్లో, పట్టణాల్లోని వార్డుల్లో ఎక్కువ మందిని ప్రభావితం చేయకలిగిన వారిని పిలిచిపించి తమకు ఈసారి సాయం చేయండి... మీకు ఏం కావాలో చెప్పండి.. అని బేరాలు చేస్తున్నారు. పట్టణాల్లో వార్డులు, గ్రామాల్లోని కీలక నేతలతో మంతనాలు చేస్తున్నారు. వ్యక్తిగత అంశాలతో పాటు సామాజిక అంశాలపై కూడా టిడిపి వైసిపి నేతలు హామీలు గుప్పిస్తున్నారు.

వివిధ మునిసిపాలిటీల్లో వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యేలు, కొత్తగా పోటీకి సిద్ధమైన వారు ఇన్‌ఛార్జిలు వ్యాపారులను గత ఐదేళ్ల కాలంలో వివిధ రూపాల్లో వేధించారు. టిడిపి అభ్యర్థులతో ఇంకా జనసేన, బిజెపి అభ్యర్థులు పూర్తిగా మమేకం కావడం లేదు. వారితో కలిసి ప్రచారానికి ప్రయత్నిస్తున్నారు. వ్యాపారులను వివిధ రూపాల్లో మచ్చిక చేసుకుని తమకు సహకరించాలని కోరుతున్నారు. గతంలో తమకు అనుకూలంగా పనిచేయని సామాజిక వర్గాలను ఆకట్టుకునేందుకు వైసిపి కూడా తమ పార్టీ అధికారంలోకి వస్తే అది చేస్తాం... ఇది చేస్తాం అని హామీలు గుప్పిస్తున్నారు. వైసిపిలో దాదాపు ఏడుగురు సిట్టింగ్‌లు రంగంలో ఉండగా మరో ఏడుగురు కొత్త అభ్యర్థులు అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు. పార్లమెంటుకు సంబంధించి గుంటూరు నుంచి పోటీ చేస్తున్న టిడిపి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ఒక్కరే కొత్తవారు. కిలారి రోశయ్య ఇప్పటికే పొన్నూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. నర్సరావుపేటలో సిట్టింగ్ ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు వైసిపినుంచి టిడిపిలో చేరి ఆ పార్టీ తరుఫున పోటీ చేస్తున్నారు. నెల్లూరు ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ వైసిపి తరుపున నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. మొత్తంగా ఈసారి ఎన్నికల్లో డబ్బు ప్రభావంతోనే ఇరుపార్టీల్లో అభ్యర్థుల ఎంపిక జరిగింది. ఈ మేరకు భారీగా ఖర్చుకు సిద్ధం అవుతున్నట్టు తెలుస్తోంది. రోజువారీగా ప్రచారంలో పాల్గొనే వారికి కూలి, ఆహార పానియాలు అందిస్తున్నారు. కొంత మంది శాశ్వత ఉద్యోగులు, పార్టీ కార్యకర్తలకు వసతి కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. గుంటూరు లోక్‌సభలో టిడిపి, వైసిపి అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. నర్సరావుపేట లోక్‌సభ పరిధిలో ప్రచారంలో అధికారపార్టీ అభ్యర్థులు ముందంజలో ఉన్నారు.